

నత్తనడకన రైల్వే బ్రిడ్జి పనులు



అసంపూర్తిగా ఉన్న రైల్వే బ్రిడ్జి

- భూ సేకరణలో జాప్యం
- గేటు పడితే ట్రాఫిక్‌కు అంతరాయం
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11: కరీంనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ పథకం కింద 154 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. భూ సేకరణలో జాప్యంతో పనులు ముందుకు సాగడం లేదు. రెండు నెలల క్రితం స్థానిక ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రైల్వే బ్రిడ్జి పనులపై రైల్వే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రం నిధులు 36లక్షల రూపాయలను తీసుకువచ్చి రాత్రికి రాత్రే రహదారి నిర్మాణం చేపట్టారు. మార్చి నెలాఖరుకు ఒకవైపు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు సైతం తెలిపారు. అప్పటి నుంచి ఓవర్ బ్రిడ్జి పనులు సాగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జి సమీపంలో పూర్తి స్థాయిలో భూసేకరణ, విద్యుత్ లైన్‌ల తొలగింపు వంటివి పూర్తి కాలేదు.



గేటు పడడంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

● కిలో మీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు

రైళ్ల రాకపోకలు పెరుగుతుండటంతో ఎప్పుడు గేటు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గేటు పడ్డ సమయంలో కిలో మీటర్ల మేర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆప్రాంతంలో కనీసం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కూడా చేపట్టక పోవడంతో ఇరువైపుల వచ్చే వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అయ్యి గంటల తరబడి వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. రెండు వైపులా రైల్వే వంతెననిర్మాణంతో పాటు, రోడ్డు కిరువైపులా భూమి సేకరణతో పాటు, సర్వీసుల రోడ్ల నిర్మాణాలుచేపట్టాల్సి ఉంది. ఈ పనులు రైల్వే వంతెన నిర్మాణం ఇప్పటికి పిల్లర్ల దశలోనే ఉండి, రెండు చోట్ల మాత్రమే స్లాబ్ పనులు నడుస్తున్నాయి. ఈ పనులు చేయడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందని వాహ నదారులు ప్రశ్నిస్తున్నారు. గేటు పడ్డ సమయంలో వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహన దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులు, విధులపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ఇన్‌వార్డ్, ఔట్‌వార్డ్‌లతో పాటు డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని కొన్ని విభాగాల పనితీరును చూసి అసంతృప్తిని వ్యక్తం చేశారు. చిన్న కేసుల చికిత్సను ఇక్కడే చేయాలని, అనవసరంగా వరంగల్‌కు రెఫర్ చేయవద్దన్నారు. రోగికి అత్యవసరమైతేనే ఆర్ఎంవో అనుమతితో పంపించాలన్నారు. అనవసరంగా స్కానింగ్‌ల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు పంపించవద్దన్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు తగ్గాయని, వీటిని పెంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు, డాక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామ్‌నాయక్ ఉన్నారు.

● సైదాపూర్ పీహెచ్‌సీ తనిఖీ

సైదాపూర్: సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సైదాపూర్ పాథమిక ఆరోగ్య కేంద్రంపై ఫిర్యా దులు వస్తున్నాయని, మీరు ఎమి చేస్తున్నారని సూపర్‌వైజర్లు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఇకపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.



సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

ఎఫ్‌పీఎస్‌టీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులు, క్విజ్ పోటీలు విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాలను వెలికితీస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పిఎస్‌టి) జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో జనార్దన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై రాపిడ్ ఫైర్ రౌండ్‌లో విద్యార్థులను అడిగిన ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో డీసీఈబీ ఎం స్వదేశ్‌కుమార్, ఏఎంవో కె అశోక్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎం శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి పి జైపాల్‌రెడ్డి, జీసీడీవో డి కృపారాణి, ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి రాంకిరణ్, కోశాధికారి సత్యనారాయణ, ఓదెలు కుమార్, లింగారెడ్డి, సురేంద్రకుమార్, దేవదాస్, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

● **క్విజ్ పోటీల విజేతలు :**

ప్రథమ బహుమతి: సీవీ రామన్ గ్రూప్ విద్యార్థులు: శివాంజలి (టీజీఎంఏ, ఎలగందల్), కౌశిక్‌రెడ్డి (టీజీఎం ఆర్ఎస్, తిమ్మాపూర్), ఆర్ శ్రీజ (జడ్పీహెచ్‌ఎస్, జంగపల్లి), రాంచరణ్ (సప్తగిరికాలనీ హైస్కూల్),

ద్వితీయ బహుమతి: వరాహమిహిరా గ్రూప్ విద్యార్థులు: ఎస్ విశ్వజ్ఞ (టీజీఎంఎస్, ఎలగందల్), పి రాహుల్ (టీజీఎంఎస్, గంగాధర), బి విఙ్ఞేష్ (జడ్పీహెచ్ రేణికుంట)

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్లు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సెల్వాట్కర్ తానయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షనర్లకు ట్రావెలింగ్ కన్సెషన్‌తోపాటు వారి కుటుంబానికి పూర్తిస్థాయిలో మెడికల్ రికవరీ సౌకర్యం కల్పించాలన్నారు. అత్యల్ప పెన్షన్ పొందుతున్నవారికి రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ఈపీఎస్ పెన్షనర్స్ కార్పస్ ఫండ్ నిధులు ప్రైవేట్ పరం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్పస్ ఫండ్‌పై వచ్చే వడ్డీకి అనుగుణంగా పెన్షన్ 5,800 ఇవ్వాల్సి ఉన్నప్పటికి 1,486 రూపాయలు చెల్లించడం సరికాదని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల మల్లయ్య, సయ్యద్ మునురుద్దీన్, నల్ల ప్రభాకర్‌రెడ్డి, నాయ కులు తూముల సురేందర్‌రెడ్డి, కేశిరెడ్డి, రాంచం ద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింగరావు, ఐ నర్సయ్య పాల్గొన్నారు.

మద్యం షాపులకు బీర్ల సరఫరా నిలిపివేత

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపులు, బార్లకు మద్యం డిపో నుంచి బీర్ల సరఫరాను మంగళవారం నిలిపివేశారు. ప్రభుత్వం బీర్ల ధరలను 15 శాతం పెంచినప్పటికీ ఆ ఉత్తర్వులు ఇంకా అందలేదని జిల్లా ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దీంతో ప్రస్తుతానికి మద్యం షాపులకు డిపో నుంచి విస్కీ, బ్రాందీ, రమ్, వొడ్కా వంటి మద్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఎండలు ముదరడంతో బీర్లకు డిమాండ్ అధికంగా ఉంటుంది. దీనికితోడు ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది. ఉత్తర్వులు వచ్చే లోపు బీర్లను కొనుగోలు చేసేందుకు మంగళవారం మద్యం షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున డీడీలు తీసి డిపో వద్దకు వచ్చారు. బీర్ల అమ్మకాలను నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించడంతో వెనుదిరిగారు. ప్రస్తుతం మద్యం షాపుల్లో ఉన్న బీర్ల స్టాక్‌ను విక్రయించకుండా లైసెన్స్‌దారులు కొన్ని చోట్ల నోస్టాక్ బోర్డులు పెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావును సంప్రదించగా బీర్ల ధరలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ప్రస్తుతం మద్యం షాపుల్లో ఉన్న బీర్లను పాత ధరలకే విక్రయించాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

33 నామినేషన్ల తిరస్కరణ
- పట్టభద్రుల స్థానంలో 32
- ఉపాధ్యాయ స్థానంలో ఒకటి
- 13 వరకు ఉపసంహరణ

7

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన
దేశానికే మార్గదర్శకం
- బీఆర్ఎస్, బీజేపీకి కులగణనపై మాట్లాడే అర్హత లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

7

ఎమ్మెల్యేను బెదిరించిన కేసులో
నిందితుడి అరెస్ట్

6

మార్చి నెలాఖరులోగా 'స్మార్ట్' పనులు పూర్తికావాలి

- ప్రతి ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించండి
- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులన్నింటినీ మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజనీరింగ్ అధికారులు, పీఎంసీ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 31 వరకు స్మార్ట్‌సిటీ గడువు పొడగించినందున ఆలోగా నగరంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు వెనక్కి వెళ్లకుండా చూడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రెండు ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించి, గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన ప్రాజెక్టులకు సంబంధించిన వర్క్ స్లిప్ ఆర్డర్ పెట్టి బిల్లులు చెల్లింపు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మార్ట్‌సిటీ ప్రారంభం నుంచి మార్చి 31 వరకు చేపట్టిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డిటేల్డ్ రిపోర్టు అందించాలన్నారు. వచ్చే బోర్డు మీటింగ్ వరకు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలను సిద్ధం చేయాలని ఆదేశిం చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌కు సంబంధించిన పనులను ప్రజారోగ్యశాఖ సమన్వయంతో ప్రారంభించి, ఇంటింటికి కనెక్షన్లు ఇచ్చి ఎస్టీపీకి అనుసంధానం చేయాలని సూచించారు. పద్మనగర్ జంక్షన్ సుందరీకరణ పనులను వెంటనే ప్రారంభించి, వేగంగా పూర్త య్యేలా చూడాలని, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సర్కిల్‌ను రూపొందించి జంక్షన్‌కు మార్కింగ్ తీసుకో వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఈ క్లాస్ రూమ్స్, ఆధునీకరణ పనులను త్వరగా పూర్తి చేసి బిల్ రికార్డు చేయాలని ఆదేశించారు. చివరి బోర్డు మీటింగ్ వరకు ప్రాజెక్టులకు సంబంధించి ఇచ్చిన ఆదేశాల ప్రకారం పనులన్నీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈ ఓంప్రకాశ్, లచ్చిరెడ్డి, అయూబ్‌ఖాన్, వెంకటేశ్వర్లు, సతీష్, పీఎంసీ అధికారి సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

● విలీన గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

నగరపాలక సంస్థలో విలీనమైన చింతకుంటతో పాటు అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చింతకుంట గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి పరిశుభ్రతను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు పిన్ పాయింట్ పద్ధతిని అమలు చేసి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, ప్రతి రోజూ ఉదయం కార్మికుల హాజరును బయోమెట్రిక్‌లో నమోదు చేయాలని సూచించారు. డ్రైనేజీల్లోని సిల్ట్‌ను, పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశించారు. కార్య క్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై ప్రత్యేక దృష్టి

- విద్యార్థులతో ఉన్నతాధికారుల ముఖాముఖి
- మెళకువలు...భయాందోళనలు తొలగించే చర్యలు
- ప్రత్యేక తరగతుల నిర్వహణ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే విద్యా ర్థుల్లోని భయాందోళనలను తొలగించేందుకు మానసిక వైద్య నిపుణు లతో పరీక్షా సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవీ నర్సింహా రెడ్డి హైదరాబాద్ నుంచి విద్యార్థులతో ముఖాముఖి కార్య క్రమాలను మంగళవారం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టు ఫ్లాట్ ప్లానర్ (టీవీ)లో టీసాట్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. విద్యా ర్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు... ప్రత్యేక నిర్వహిస్తున్నారా.. విద్యార్థులందరు హాజరవుతున్నారా... వారికి ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందిస్తు న్నారా అనే విషయాలను ఉపాధ్యాయులు, విద్యా ర్థులను అడిగి తెలుసుకున్నారు. మార్చి 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఒకరోజు ముందు వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అల్పా హారం అందించాలని సూచించారు. జిల్లాలో 4,063 మంది విద్యా ర్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికి ప్రతిరోజు ఒక్కొక్కరికి 15 రూపాయల చొప్పున స్నాక్స్ అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో 38 రోజులపాటు ప్రత్యేక తరగతుల్లో పౌష్టికాహారాన్ని స్నాక్స్‌గా అందిస్తున్నారు.



కరీంనగర్ మండలం నగునూరు పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న ఎంఈవో రవీందర్

స్వదేశీ మేళాను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వదేశీ జాగరణ్‌మంచ్ కన్వీనర్ ముక్కు హరీష్ బాబు

- స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్కు హరీష్‌బాబు

భగత్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వదేశీమేళా, ఉద్యోగ్ మహోత్సవ్‌ను విజయవంతం చేయాలని స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్కు హరీష్‌బాబు అన్నారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీమేళా, ఉద్యోగ్‌మహోత్సవ్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆరు వేల మంది నిరుద్యో గులు జాబ్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 110 కంపె నీలు, వివిధ సంస్థలు ఉద్యోగ స్టాల్స్ ఏర్పాటు చేశాయన్నారు. ఈ నెల 16 వరకు నిర్వహించనున్న స్వదేశీ మేళాను విజయవంతం చేయాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్స హించే లక్ష్యంతో మేళాను నిర్వహిస్తున్నామన్నారు. దేశీయ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 210కి పైగా స్టాల్స్ బుధవారం నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభ మవుతాయని తెలిపారు. బుధవారం పది గంటల నుంచి ఒంటి గంటవరకు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మేళా కో కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి, మాధవరావు, గంప వెంకట్, ఉట్కూరి రాధకృష్ణా రెడ్డి, రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ శ్రీనిజ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన నల్లాల విక్రమ్‌కు 11 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీలేఖతో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ విక్రమ్ తన భార్య శ్రీలేఖను తరచుగా వేధించాడు. పెద్ద మనుషుల సమక్షంలో పలు పంచాయితీలు జరిగాయి. అయినప్పటికీ విక్రమ్ భార్యను వేధించడంతో పాటు 2019 మార్చి 17న దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్షులను జగిత్యాల కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి ఒక వాహనానికి తీసుకుని మరో ట్రాలీతో ఇసుకను రవాణా చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కంకణాల సుధాకర్, డ్రైవర్ సూర నరసింహులుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతివేగం, అజాగ్రత్తగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో తనిఖీ చేయగా ఒక ట్రాక్టర్ నంబర్‌పై అనుమతి పొంది మరో ట్రాలీతో రవాణా చేయడాన్ని గుర్తించామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను తరలించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పొత్తూరు సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన రంగు రజనీకాంత్, మామిండ్ల పర్శరాంలను అరెస్టు చేసి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. మానకొండూర్ మండలం వెల్ది గ్రామం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కాచాపూర్ శివారులో పట్టుకున్నారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన చెంచల సంపత్(35) అనే యువ రైతు మంగళవారం ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. రోజు వారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సంపత్ చింతచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,100 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 225క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు.ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.



చెరువు నుంచి కొట్టుకొచ్చిన రాళ్లు

చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

● రెండున్నరేళ్లుగా రైతుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని గంగారాంతండా, సూరంపేట గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం వర్షాల కారణంగా పోతు చెరువు కట్ట నీటి ప్రవాహానికి తెగింది. దీంతో కట్ట కింద ఉన్న పొలాలలో ఇసుక మేటలు పెట్టాయి. పలువురు రైతుల పశువులు, మేకలు మృతి చెందాయి. బోరుబావులు, వ్యవసాయ బావులు, పైపులైన్లు, కరెంట్ స్థంబాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. దీంతో సుమారు 250 మంది రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. పలు శాఖల అధికారులు వచ్చి ఆస్తి, పంట నష్టం సర్వే చేసినా పరిహారం అందలేదు. 20 మంది బాధితులకు రెడ్ క్రాస్ సంస్థ 2వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. పోతు చెరువు కింద 500 ఎకరాల నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికీ చెరువు కట్ట మరమ్మతుకు నోచుకోక పోవడంతో రెండున్నరేళ్ళుగా కురుస్తున్న వర్షాలకు నీరు వృథాగా పోతోంది. పోతు చెరువు నీటితో నిండినట్ల యితే మండలంలోని కోనాపూర్, పోతారం, దమ్మయ్య పేట చెరువులే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోవిం దారం, పసునూరు, చందుర్తిమల్యాల, రామన్న పేట, నర్సింగాపూర్ గ్రామాల చెరువులకు కూడా భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోతు చెరువు కట్టకు మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.





తెగిన పోతుచెరువు కట్ట, పొలాల్లో ఇసుక మేటలు

మరమ్మతు చేయించాలి

బొజ్యానాయక్, మాజీ సర్పంచ్ గంగారాంతండా



పోతు చెరువుకట్టకు మరమ్మతు చేయించాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. కట్ట తెగిపోవడంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

ప్రతిపాదనలు పంపాం

రాజేష్‌ఖన్నా, నీటి పారుదల శాఖ ఏఈఈ



మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు 3కోట్ల 78 లక్షల రూపాయల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

ఎమ్మెల్యేను బెదిరించిన కేసులో నిందితుడి అరెస్టు

● బెంగుళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను వాట్సప్ కాల్ ద్వారా బెదిరించి, 20 లక్షలు డిమాండ్ చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి(33)ని కొత్తపల్లి పోలీసులు సోమవారం బెంగుళూరులో అరెస్టు చేశారు. మంగళవారం అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ మీడియాకు వివరాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గత సెప్టెంబరు 28న లండన్ నుంచి అఖిలేష్‌రెడ్డి వాట్సప్‌కాల్ చేసి తనకు రూ. 20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతిష్టపాలు చేస్తానని, గౌరవానికి భంగం కలిగిస్తానని, ఎమ్మెల్యే ఇద్దరు పిల్లలను అనాథలయ్యేలా చేస్తానంటూ బెదిరించాడు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి అని, అతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్టోబరు నెలలో అప్పటి కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ లుక్ అవుట్ సర్క్యులర్‌ను జారీ చేశారు. నిందితుడు ఈ నెల 9న బెంగుళూరు విమానాశ్రయానికి వచ్చినట్లు గమనించిన బెంగుళూరులోని ఇమ్మిగ్రేషన్ అధికారులు వెంటనే అఖిలేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కొత్తపల్లి ఎస్ఐకి సమాచారం అందించారు. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తన సిబ్బందితో బెంగుళూర్‌కు వెళ్లి నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తీసుకువచ్చారు. మంగళవారం కోర్టులో హాజరుపరచి, మెజిస్ట్రేట్ ఆదేశాలతో కరీంనగర్ జైలులో రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడినా విచారణ జరిపించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన గండి వీరేశం అనే వృద్ధుడు కోడలు, కొడుకు తిట్టి ఇంటిలో నుంచి వెళ్లగొట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటలో కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు.

భార్య, కొడుకుపై హత్యాయత్నం : నిందితుడి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య, కొడుకుపై హత్యాయత్నం చేసిన ఘటన గోదావరిఖని జీఎం కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో నిందితుడు మడిపల్లి ఉదయ్(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగి ఉదయ్ 2022లో అనూష అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 18నెలల బాబు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో ఉదయ్‌పై కేసు నమోదైంది. కుటుంబ వివాదాలతో భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. భార్య అనూష గోదావరిఖని జీఎం కాలనీలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఉదయ్ అత్తగారింటికి వెళ్లి భార్య, కుమారున్ని బైక్‌తో ఢీకొట్టి చంపేప్రయత్నం చేశాడు. చుట్టు పక్కల వారు అడ్డుకోవడంతో పారిపోయాడు. అనూష ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేశామని, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరి తీరంలో యథేచ్ఛగా ఇసుక దందా

● అనుమతి లేకుండా ఇసుక రీచ్‌లు ● అధికార పార్టీ నేత కనుసన్నల్లో రవాణా

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది తీరంలో ఇసుక అక్రమ దందా నడుస్తోంది. రామగుండం మండలం మేడిపల్లి శివారు గోదావరి తీరంలోని ఇసుక రీచ్ నుంచి కొన్ని రోజులుగా ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. మేడిపల్లి శివారులోని రీచ్ నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి లేకున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుడి పలుకుబడితో ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు మాత్రమే ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ప్రాంతంలో అంతర్గాం మండలం గోలివాడ రీచ్‌కు మాత్రమే అనుమతి ఉంది. అయితే మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండానే మేడిపల్లి శివారు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఇసుకను తరలించ లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని గోదావరి నీరు లేకపోవడంతో ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు అనుమతి నిచ్చి ఉచితంగా సరఫరా స్కీంను అమలు చేస్తున్నది. ఇది కూడా కేవలం సొంత ఇంటి నిర్మాణాలకు మాత్ర మే ఇసుకను సరఫరా చేసే అవకాశముంది. అంతర్గాం గోలివాడ రీచ్ నుంచి మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉంది. మేడిపల్లి నుంచి అక్రమంగా రోజుకు రెండు, మూడు వందల ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు.



మేడిపల్లి గోదావరి రీచ్ నుంచి ఇసుక తవ్వకాలు

ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ. 100 వసూలు

ఇసుక దందా నడిపిస్తున్న అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒక్క ట్రాక్టర్ ఇసుక ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు రూ.2వేల నుంచి రూ.2,300 తీసుకుంటున్నారు. దీని కోసం ఇక్కడ ఒక వ్యక్తిని నియమించి నోట్‌బుక్‌లో ట్రిప్పుల లెక్కలు నమోదు చేస్తున్నారు. రోజుకు 200కుపైగా ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది. ఇక్కడ ఎన్టీపీసీకి చెందిన ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మల్కాపూర్ శివారులో మరో రీచ్‌ను అధికార పార్టీకి చెందిన నాయకుడి కనుసన్నల్లో నడుస్తున్నది.



ఇసుక ట్రిప్పులను నమోదు చేస్తున్న వ్యక్తి

అక్కడ గోదావరిఖనిట్రాక్టర్లకు మాత్రమే అనుమతినిచ్చి ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుక

కుమారస్వామి, రామగుండం తహసీల్దార్

ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుకను అనుమతిచ్చామని రామగుండం తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. జిల్లాలో 6 రీచ్‌లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మేడిపల్లి శివారులో ఇసుక తరలింపు సమాచారం లేదన్నారు. ఉచిత ఇసుకకు సంబంధించి తహసీల్దార్లకే అధికారం ఇచ్చినట్లు జిల్లా మైనింగ్ అధికారి తెలిపారు.

కాకతీయ కెనాల్‌లో ఒకరి గల్లంతు.. కాపాడబోయిన మరొకరి మృతి



సురేష్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సమీపంలో కాకతీయ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. అతడిని కాపాడటానికి ప్రయత్నించిన అతని మిత్రుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన జూపాక శ్రీహరి(48), రేణిగుంట్ల సురేష్(30) అనే ఇద్దరు మంగళవారం గ్రామ శివారులోని కాకతీయ ఉప కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముందుగా జూపాక శ్రీహరి కాకతీయ కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అందులో కొట్టుకపోయాడు. గమనించిన సురేష్ కాపాడేందుకు కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో సురేష్ సైతం కొట్టుకొని పోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులు సమాచారం అందించారు. కొంతమంది యువకులు సురేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. శ్రీహరి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సంఘటన స్థలానికి హుజూరాబాద్ సీఐ తిరుమల్‌గౌడ్ చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో గల్ఫ్‌లో మృతి

● స్వగ్రామానికి చేరిన మృతదేహం



వెంకటస్వామి(ఫైల్)

రామడుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా.. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నీలం వెంకటస్వామి కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అయితే అక్కడ పనులు చేస్తుండగా ఈ నెల 6న గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమై ఆలయన మృతదేహం కోసం ఎదురు చూశారు. మృతదేహన్ని ఎయిర్‌పోర్ట్ నుంచి స్వగ్రామానికి తీసుకరావడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంబులెన్స్ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు.

బాలుడిని తప్పించబోయి ఆటో బోల్తా

● ఆరుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై ఎదురుగా వస్తున్న బాలుడిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన 11మంది మహిళా సంఘ సభ్యులు బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలోని బ్యాంకుకు వెళుతున్నారు. సంకెపల్లి గ్రామంలోకి వెళ్లేలోపు ఎదురుగా సైకిల్‌పై వస్తున్న బాలుడిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణించే కట్కూరి కవితకు తీవ్రగాయాలై పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌కు చేయి, మహిళకు చేతివేళ్లు విరగగా, మరో మహిళ శ్వాసతో ఇబ్బంది పడటంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి స్వల్ప గాయాలు కాగా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ వందుగ ప్రదీప్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సమాచారం అందించడంతో మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వైద్యాధికారి రజిత, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యలను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి రజిత క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

వొకేషనల్ ఉపాధ్యాయుడి హఠాన్మరణం



నవీన్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బందారపు నవీన్(33) మంగళవారం పాఠశాలలో గుండెపోటుకు గురయ్యాడు. తోటి ఉపాధ్యాయులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన నవీన్ రెండు సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో కంప్యూటర్ టీచర్‌గా విధుల్లో చేరాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా ఆసుపత్రికి చేరుకొని నవీన్ మృతదేహన్ని పరిశీలించారు.

దొంగ బాబాకు దేహశుద్ధి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థులు దొంగ బాబాను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో హన్మాన్ మాలధారణలో ఉన్న ఓవ్యక్తి జ్యోతిష్యం పేరుతో గ్రామంలోని పలువురి డబ్బులు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కొందరు దొంగబాబా పారిపోయినట్టు తెలుసుకుని వెంబడించారు. మల్లాపూర్‌లో దొంగబాబాను పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు దొంగబాబాను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మించిన మూడో ఫ్లోర్‌ను మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామానికి చెందిన ఓ మహిళ జీ ప్లస్-2 నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు తీసుకుని జీ ప్లస్-3 నిర్మించారు. దీంతో అనమతులకు విరుద్ధంగా నిర్మించిన ఫ్లోర్‌ను తొలగించాలని గ్రామానికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రెండు రోజుల క్రితం మూడో అంతస్తును తొలగించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో కూల్చివేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.



మంథనిలో కూరగాయలు అమ్ముతూనే హఠాన్మరణం చెందిన శంకరమ్మ

వెంటాడిన విధి


పాము కాటుతో గొర్రెల కాపరి మృతి

కూరగాయలు అమ్ముతూ వృద్ధురాలి హఠాన్మరణం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వారిద్దరినీ విధి వెంటాడింది. బతుకు పోరులో వారు పని ప్రదేశంలోనే మృత్యువాత పడటం అక్కడ ఉన్న వారిని కలిచి వేసింది. కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ రాజయ్య(53) అనే గొర్రెల కాపరి సోమవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందాడు. రామగుండం మండలం లక్ష్మీపురం శివారులో గొర్లను మేపడానికి మంద ఏర్పాటు చేసుకున్నాడు. మంద ఏర్పాటు చేసుకున్న ప్రదేశం పక్కన నేలపై గొర్లకాపరి నిద్రించగా పాముకాటు వేయడంతో రాజయ్య నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. రాజయ్య కుటుంబ సభ్యులు ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మృతదేహనికి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య స్వరూప, కుమారులు రమేష్, సంజీవ్‌లు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎన్‌టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంథనిలో వృద్ధురాలు..

మంథని: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కూరగాయలు అమ్ముతూ ఓ వృద్ధురాలు ఒక్కసారిగా కుప్పకూలి విగతజీవిగా మారిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన చీర్ల శంకరమ్మ(60) అనే వృద్ధురాలు మంథనిలో కూరగాయలు అమ్ముతూనే గుండెపోటుకు గురై మృతి చెందింది. నిత్యం బస్సులో సొంత గ్రామం నుంచి కూరగాయలు తీసుకొని వచ్చి మంథనిలో కూరగాయలు అమ్ముకుంటున్న శంకరమ్మ మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. ఆమెతో ఉన్న మహిళ గమనించి పక్కవారి తెలియజేయడంతో వారు 108కు సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరితో కలిసిమెలిసి ఉంటూ పనిచేసుకునే శంకరమ్మ హఠాన్మరణం చెందడం కలిచివేసింది.



ఘటన స్థలంలో మృతి చెందిన గొర్రెల కాపరి రాజయ్య

ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



సాత్విక

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక అనే విద్యార్థిని ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు సాత్విక ఎంపికవడంపై ప్రధానోపాధ్యాయిని కరుణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని మంగ అభినందించారు. పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు వారు తెలిపారు.


యంత్రంపై దారం చుడుతున్న మహిళ


మగ్గాన్ని శుభ్రం చేస్తున్న కార్మికుడు

మూగబోయిన మరమగ్గం

- 18 నెలలుగా పనులు లేక పస్తులు
- 'ఇందిర స్వశక్తి' చీరలపై నేతన్న ఆశలు
- ఆపన్న'హస్తం' కోసం కార్మికుల నిరీక్షణ

గంగాధర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాల తయారీలో మరో సిరిసిల్లగా పేరున్న గంగాధర మండలం గర్శకుర్తిలో ఇప్పుడు నైరాశ్యంనెలకొన్నది. ఏ నేతన్నను కదిపినా చేతినిండా పనిలేక.. కడుపునిండా తిండి దొరకక అవస్థలు పడుతన్నారు. ఓవైపు గత బీఆర్ఎస్ పాలన నాటి దాదాపు రెండు కోట్ల రూపాయల బకాయిల ఆర్థికభారం... మరోవైపు చేసేందుకు పనిలేక ఇబ్బందిపడుతున్నారు. గడపగడపకు మగ్గాల చప్పుడుతో రంగురంగు ల డిజైన్లతో చీరలకు వన్నె తెచ్చిన పద్మశాలీల మరమగ్గాలు మూగ బోతున్నాయి. తరతరాలుగా వచ్చిన కులవృత్తిని నమ్ముకున్న కుటుంబాలు పనిలేక పూట గడవక కష్టంగా మరింది .కుల వృత్తిలో పనిలేక అప్పుడప్పుడూ ఇతర పనులు చేస్తూ కార్మికులు అష్టకష్టాలు పడు తూ బతుకు బండిని నెట్టుకొస్తున్న మర మగ్గాల కుటుంబాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అప్పులు చేసి కుటుంబ పోషణ

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో 16 వందల మరమగ్గాలతో పాటు చేనేత మగ్గాలున్నాయి. వీటిపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవించే కుటుంబాలు 800 వందలున్నాయి.

18 నెలలుగా చేసిన మగ్గాలు నిలిచిపోయాయి. దీంతో పనిలేక కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం కార్మికులను గుర్తించి పని కల్పిస్తుందన్న భరోసాతో కాలం వెల్లదీస్తున్నారు. గతంలో ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను గర్శకుర్తికి ఇవ్వడంతో కార్మికులకు చేతి నిండా పని దొరికింది. గర్శకుర్తితో పాటు గట్టుబూత్కూర్, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గంగాధర గ్రామాల్లో బతుకమ్మ చీరలను తయారు చేసేవారు. ఈ ఆర్డర్లు నిలిచిపోవడంతో 18 నెలలుగా పనిలేక కార్మికులు చిన్నచితకా పనులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

స్కూల్ యూనిఫామ్‌ల ఆర్డర్‌తో ఊరట

కొత్త ప్రభుత్వంలో స్కూల్ యూనిఫామ్‌లకు సంబంధించిన ఆర్డర్లు అందించగా కార్మికులకు రెండు నెలల క్రితం కొంత పని దొరికింది. ప్రభుత్వం బతుకమ్మ చీరల తరహాలో ఇందిర మహిళ శక్తి చీరల ఆర్డర్లను అందిస్తామని హామీ ఇవ్వడంతో గర్శకుర్తి నేతన్న కార్మికులు మురిసి పోతున్నారు. చీరల తయారీతో చేతినిండా పని దొరుకుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. మగ్గాల బూజుదులుపుతున్నారు.

పెట్టుబడి లేక ఇబ్బందులు

వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు డిపో నుంచి గర్శకుర్తికి ముడిసరుకును అందించాలని, దీనితో ఆర్థిక భారం తగ్గుతొందని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే గర్శకుర్తికి జౌళిశాఖ నుంచి మూడు లక్షల మీటర్ల ఆర్వీఎం, పీసీ తయారికి ఉత్తర్వులు వచ్చాయి. పెట్టుబడులు లేక పనులు నిలిచి పోయాయి. వేములవాడ డిపో నుంచి సబ్సిడీపై ఇవ్వక పోవడంతో పని చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదని కార్మికులు తెలిపారు. నూలుకు సబ్సిడీ ఇచ్చి సంవత్సరం పొడుగునా పనికల్పించాలని మగ్గాల కార్మికులు కోరుతున్నారు.

భారంగా రూ. రెండు కోట్ల బకాయిలు

గత ప్రభుత్వంలో తయారు చేసిన బతుకమ్మ చీరల బిల్లులు గర్శకుర్తికి ఎనిమిది కోట్ల బిల్లులు నిలిచి పోయాయి. బిల్లులు చెల్లించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరగా ఆరు కోట్లు విడుదల చేసింది. మరో రెండు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నారు. దీంతో కొత్త పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది.


అరబెడుతున్న కార్మికుడు


కండెలు చుడుతున్న మహిళ



స్వశక్తి చీరల ఆర్డర్లతో కార్మికులకు ఉపాధి
యగ్నేష్, కాంగ్రెస్ నాయకుడు

ప్రభుత్వం మరగ్గాల కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు స్వశక్తి మహిళ చీరల ఆర్డర్ల ఆలోచన అభినందనీయం. గర్శకుర్తితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మగ్గాలకు పని కల్పించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లి ఉపాధి కల్పించాలని కోరుతా.



కార్మికులకు పని కల్పించాలి
గడ్డం నారాయణ, అధ్యక్షుడు, మరమగ్గాల కార్మికుల సంఘం, గర్శకుర్తి

వృత్తిని నమ్ముకున్న మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వం పని కల్పించాలి. గతంలో బతుకమ్మ చీరల తయారీతో ఆరు నెలల పని చేసేవారం. మిగతా సమయంలో పని దొరికేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిర స్వశక్తి చీరల ఆర్డర్లను ఇస్తామని హామీ ఇచ్చింది. దీనితో పాటు ఇతర గుడ్డల తయారీకి ఆర్డర్లు ఇస్తే కార్మికులకు చేతినిండా పని దొరుకు తుంది. ప్రభుత్వం మగ్గాల కార్మికులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పింఛన్ అందించాలి.

పశువుల పాకల నిర్మాణానికి రైతుల ఆసక్తి


గుండిలో నిర్మించిన పశువుల పాక



రామడుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు చేయూతను అందించేందుకు మహిళ భరోసా పథకం కింద పశువులు, మేకల పాకలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకం ప్రయోజనకరంగా ఉండడంతో మండలంలో 77 మంది పశువుల పాకల నిర్మాణం ప్రారంభించారు. 30 మంది రైతులు నిర్మాణాలు దాదాపు పూర్తి చేశారు. ఇందులో 13 మందికి రైతులకు బిల్లులు చెల్లించారు. మరో 14 మేకల పాకలు మంజూరయ్యాయి. వాటిలో ఏడు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇద్దరికి బిల్లులు చెల్లించినట్లు ఏపీవో రాధా తెలిపారు. నాడెం కంపోస్ట్ షెడ్లు, అజోల్ల గడ్డి పెంపకం షెడ్ల నిర్మాణం కూడా రైతులు చేపడుతుండగా వారికి అదనంగా డబ్బులు చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పశువుల పాక నిర్మాణానికి 89 వేలు, మేకల పాకకు 1.19 లక్షల రూపాయలు నిధులను అందజేస్తున్నారు. వీటిని తిరిగి చెల్లించే అవసరం లేదు. పశువులు, గొర్రెల, మేకల పాకల నిర్మాణంతో ఎండ వాన, చలి వన్య ప్రాణుల నుంచి పశువులను రక్షించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు తహసీల్దార్ నుంచి, పశువులు ఉన్నట్లు పశు వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. గ్రామ పంచాయతీ తీర్మానం చేస్తే ఈ పథకం కింద నిధులు పొందవచ్చు.

ఉపయోకరంగా ఉంది: మడ్డి ఎల్లయ్య,రైతు, గుండి



పశువుల పాక నిర్మించుకోవడానికి ప్రభుత్వం చేసిన పని చాలా బాగుంది. ఎండ, వాన చలి నుంచి పశువులను కాపాడుకోవడానికి చక్కని మార్గం చూపిస్తుంది. షెడ్డుతో పాటు పెంట కుప్ప, గడ్డి పెంచడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నా..

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన

దేశానికే మార్గదర్శకం

- బీఆర్ఎస్, బీజేపీకి కులగణనపై మాట్లాడే అర్హత లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాలవారీగా ఎవరి లెక్క ఎంత అనేది తేలాలని భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ ఎప్పుడో స్పష్టం చేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ దొందూ.. దొందేనని, రాంగ్ డైరెక్షన్‌లో పోయేలా ఈ రెండు రాజకీయపార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో కులగణన చేసినట్లు తెలిపారు.

కులగణన చేయాలనే నిర్ణయం నుంచి నివేదిక వరకు, నివేదిక నుంచి నిధుల వరకు ఎలా అమలు చేయాలనే దానిపై రూట్‌మ్యాప్ తయారు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. మేధావులు, అన్నికులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కులగణనపై అనవసర అనుమానాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఆ రెండు పార్టీలకు ఇష్టంలేదా అని ప్రశ్నించారు. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామన్నారు. బీసీల్లో ముస్లిం మైనార్టీలు ఉండటం అనేది ఇప్పుడు కొత్తది కాదని, గతంలో కూడా ఇదే విధానం ఉండేదన్నారు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్‌ను టార్గెట్ చేయవద్దన్నారు. ఎర్రచొక్కా వేసుకున్నవారంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నా నని, అంతమాత్రాన తాను నక్సలైట్‌ను అవుతానా? అని ప్రశ్నించారు.

కులగణనలో భాగంగా సర్వేకు వెళ్లిన అధికారులకు ఎలాంటి వివరాలు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఇప్పుడైనా తమ కుటుంబ, ఆస్తులు, ఇతర వివరాలు అందజేయాలని కోరుతూ సర్వేఫాంలను పోస్ట్ ద్వారా ఆ ముగ్గురు నేతలకు పంపిస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్ ముగ్గురు నేతలు వారి వివరాలు అందజేసిన తరువాతనే కులగణనపై మాట్లాడేందుకు అర్హులవుతారన్నారు. కులగణనను అడ్డుకుంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్‌ను సమర్పించిన కేంద్రంలోని బీజేపీకి, సర్వేలో పాల్గొనకుండా, వివరాలు అందజేయని బీఆర్ఎస్‌లకు కులగణనపై మాట్లాడేందుకు నైతిక అర్హత లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన సర్వే చేయించాలని మంత్రి సవాల్ విసిరారు. బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత నుంచి తొలగిస్తే బీసీ సమాజం బాధపడ్డదని తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ నినాదం అయిపోవటంతో ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకుందని మంత్రి విమర్శించారు. అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, ఎండీ ఆరిఫ్, నాయకులు మంద నగేష్‌ముదిరాజ్, ఆకుల నర్సయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా

భగత్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థలో నియామకాలు, యూనియన్ గుర్తింపు కోసం సంస్థ డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్‌రావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎల్ఐసీ వ్యాపారం మూడు రెట్లు పెరిగిందని దీంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని అన్నారు. పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ కేడర్లలో నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించి గుర్తింపు ఇచ్చారని, ఎమర్జెన్సీ టైంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావ ప్రకటన చేసినందుకు రద్దు చేసిన గుర్తింపును ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదని అన్నారు. 90 శాతం సభ్యత్వం ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు వెంటనే గుర్తింపు ఇవ్వాలని, లేని పక్షంలో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో డివిజనల్ నాయకులు సూర్యకళ, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత, డివో యూనిట్ నాయకులు మహేష్, ప్రభాకరచారి, బ్రాంచ్ వన్ నాయకులు డి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

33 నామినేషన్ల తిరస్కరణ

- పట్టభద్రుల స్థానంలో 32
- ఉపాధ్యాయ స్థానంలో ఒకటి
- 13 వరకు ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల నామినేషన్ల పరిశీలన ముగిసింది. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 32 మంది నామినేషన్లను వివిధ కారణాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తిరస్కరించారు. సరైన ఫార్మాట్‌లో ఉన్న 68 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైంది. మిగిలిన 16 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారు.


వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమే లా సత్పతి మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్లను సమర్పించిన సంద ర్భంలో ఏమైనా లోపాలుంటే గుర్తించి అభ్యర్థులకు షాట్ మెమోలు ఇచ్చి సరి చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. కొంత మంది ఈ అవకాశాన్ని వినియోగించుకొని తప్పులను సవరించుకున్నట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టామ న్నారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను కోరామని, తిరస్కరణపై అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సందేహాలను నివృత్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్‌రామన్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏవో నరేందర్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మ.. బద్దిపోచమ్మ తల్లీ..

- అమ్మవారికి భక్తుల బోనం మొక్కులు
- నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు


బద్దిపోచమ్మ దర్శనం కోసం నెత్తిన బోనంతో క్యూలైన్‌లో భక్తులు



వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లా పాపలను, పాడి పంటలను చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన మంగళవారం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో గంటల తరబడి క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి పట్నాలు వేశారు. నైవేద్యాన్ని సమర్పించి నూతన వస్త్రాలను ధరించి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన కల్లు సాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
మున్సిపల్ కమిషనర్ అన్వేష్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27వ తేది వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు పారిశుధ్యంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ సిబ్బందికి సూచించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ ఏఈవో అశోక్, శానిటేషన్ సూపరింటెండెంట్ వరి నర్సయ్యలతో కలిసి ఆలయ పరిసరాల్లోని డ్రైనేజీలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లని, ఆలయ ఉద్యో గులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఆయన వెంట రాజన్న ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి తదితరులు ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు


ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

మల్యాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పర్య వేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా ఆలయ పరిసరాలు బురదమయంగా ఉండడడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

అంజన్న గర్భాలయానికి

వెండి తొడుగులు


వెండి తొడుగుల అనంతరం మెరిసిపోతున్న గర్భాలయం

మల్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి గర్భాలయాలని వెండి తొడుగుల అమర్చారు. రెండేళ్ల క్రితం వెండి తొడుగులతోపాటు మరిన్ని వస్తువులు చోరీకి గురయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు సోమవారం బంగారు, వెండి ఆభరణాలు, తొడుగులు అందజేశారు. సంప్రోక్షణ పూజల అనంతరం బంగారు పూత గల రామరక్ష, కిరీటం స్వామి వారి మూల విరాట్టుకు అమర్చారు. మంగళవారం గర్భాలయానికి 48.5 కిలోలతో తయారు చేసిన వెండి తొడుగులు అమర్చారు. తొడుగులకు ఉన్న శంఖు చక్రాలు, హనుమాన్ ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.


వెండి తొడుగులు చోరీకి గురికావడంతో బోసి పోతున్న గర్భాలయం (ఫైల్)

న్యూస్‌బాక్స్

సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించారు. కలెక్టరేట్ ఎన్ఐసీ, డీఐఎం అభినవ్ ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, ఎస్ఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు సంతాపం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి):మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ నాచారానికి చెందిన వారు మృతి చెందగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితులను ఆదుకోవాలని అక్కడి ప్రభుత్వాన్ని కోరారు.

డీఎస్పీ ఉద్యోగం వదిలి ప్రజా క్షేత్రంలోకి..

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): ఉన్నతమైన డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలి ప్రజాక్షేత్రంలోకి వస్తున్నానని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి మదనం గంగాధర్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సమాజం మార్పు కోసం తనకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

15న సంత్ సేవాలాల్ జయంతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): ఈ నెల 15న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని కొత్తపల్లి వైఎస్ ఎంపీపీ బూక్య తిరుపతి నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర నాయకుడు ధరావత్ తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సేవాలాల్ జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. ఫిబ్రవరి 15న ఆప్షనల్ హాలిడే కాకుండా సంపూర్ణంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతీ తండాలో నిర్వహించుకోవాలన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

- నిలిచిన ఎంఈవో కార్యాలయం పనులు
- నాలుగేళ్లుగా నిరీక్షణ



అసంపూర్తిగా ఉన్న ఎంఈవో భవనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఎంఈవో కార్యాలయ భవనానికి మోక్షం లభించడం లేదు. నిధులు చాలక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండలాల పునర్విభజనలో భాగంగా 2017లో కరీంనగర్ రూరల్ మండలం ఏర్పాటు చేశారు. కరీంనగర్ రూరల్, ఇల్లందకుంట, గన్నేరువరం మండలాల్లో ఒక్కో ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి సీఎస్‌డీఎస్‌సీ నిధులు రూ.30 లక్షల చొప్పున కేటాయించారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నాలుగేళ్ల క్రితం ఎంఈవో భవనం పనులు ప్రారంభించారు. భవన నిర్మాణం అసంపూర్తిగా చేపట్టడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. కనీసం తలుపులు, పైపులైన్, ఇతర పనులు కూడా పూర్తి కాలేదు. చేసిన పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తోంది. పైపులైన్ పైకితేలి పగిలిపోయింది. ప్రస్తుతం కరీంనగర్ రూరల్ విద్యాశాఖకు సంబంధించిన వ్యవహారాలు కరీంనగర్ అర్బన్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. సిబ్బందితోపాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని, ఎంఈవో కార్యాలయ భవనం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

-రవీందర్, ఎంఈవో

మండల విద్యా శాఖ కార్యాలయం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పనులు సగంలోనే నిలిపివేశారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఎమ్మార్సీలో కార్యాలయం కొనసాగుతోంది. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి కార్యాకలాపాలు ఒకే భవనంలో సాగుతున్నాయి.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్ చేనేత హస్త కళా ప్రదర్శన



కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరాజరాజేశ్వర కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనలో రాష్ట్రాలకు చెందిన వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్ ఇతర వస్తువులు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. చేనేత దస్తుల అమ్మకాలతోపాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్, పెరల్స్ ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్స్ బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్ జైపూరీ రాంజీ, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్స్ వస్తువులు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వదేశీ మేళా క్రీడా పోటీల్లో మానేరు విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. బాలికల ఖో-ఖో పోటీల్లో మానేరు సీబీఎస్ఈ పాఠశాల ప్రథమ, బాలుర ఖో-ఖో పోటీల్లో సాయి మానేరు పాఠశాల ప్రథమ, మానేరు సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్ రాజు చాకో, సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ పీజీ కళాశాల సైన్స్ విద్యార్థులు జగిత్యాల జిల్లా పొలాస అగ్రికల్చర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వివిధ మొక్కలు, పంటల పెంపకం, వర్మీ కంపోస్ట్, విత్తనాభివృద్ధి, ఇతర అంశాలను శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ సైన్స్ విభాగాధిపతి రవి అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే నాయకులు కావాలి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే గొంతుకలు కాదు.. సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే నాయకులు ఎమ్మెల్సీగా ఎన్నికవ్వాలని పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం కరీంనగర్‌లో పలువురు పట్టభద్రులను కలిసి తనకు మద్దతు ఇవ్వా లని కోరారు.

సుభాష్‌నగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ(ఆర్ఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు తెలిపారు.

ఘంటసాల వర్ధంతి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వావిలాలపల్లి స్వరమాధురి కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘంటసాల 51వ వర్ధంతి నిర్వహించారు. అనంతరం వంగ వెంకటేశ్వర్లు, పెద్దపల్లి రాజకుమార్, కరుణాకర్, దుర్గాప్రసాద్, జితేందర్‌రావు పాటలను ఆలపించారు. ప్రధాన కార్యదర్శి సాన వేణు, బెజ్జంకి రామబ్రహ్మం, రామకృష్ణ, ఉమేందర్, శ్రీరామోజు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి హేయమైన చర్య

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది అత్యంత హేయమైన చర్య అని శ్రీవైష్ణవ సంఘం జిల్లా శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్‌గా రాంచంద్రం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్‌గా జిల్లాకు చెందిన నిషాని రాంచంద్రంను నియమిస్తూ బీఎస్పీ అధినేత్రి మాయావతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తన నియామ కానికి సహకరించిన వారందరికీ కృత జ్ఞతలు తెలిపారు.

వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ సర్కిల్ కార్యాలయం సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ఈ నెలలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 731.78ఎండబ్ల్యూ మిలియన్ యూనిట్లు నమోదైనట్లు పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల్లో గణనీయంగా విద్యుత్ డిమాండ్ పెరిగే అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికవ్వాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికవ్వాలని తెలంగాణ యోగా సంఘం చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆకాంక్షించారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు కేరళలోని త్రివేండ్రంలో నిర్వహించనున్న 49వ జాతీయస్థాయి సీనియర్స్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రం తరఫున కరీంనగర్ జిల్లా నుంచి 14 మంది ఎంపికయ్యారు. క్రీడకారులను మంగళవారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయికి ఎంపికై తెలంగాణతోపాటు కరీంనగర్ జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని కోరారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను సన్మానించారు. యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, బాధ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న రవీందర్‌సింగ్

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ మెయిన్స్ 2025 ఫస్ట్ సెషన్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రభంజనం సృష్టించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి సాధించిన ఫలితాలు అందరికి గొప్ప ప్రేరణగా నిలుస్తాయన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, సీనియర్ అధ్యాపకుల మార్గదర్శకత్వం, అభ్యాసం ద్వారానే అద్భుత ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జేఈఈ మేయిన్స్ ఫస్ట్ సెషన్ ఫలితాల్లో అనిరుధ్‌సాయి 99.90 పర్సంటైల్, వామిక 99.88, సాయి సుముఖ 99.69, విశాల్ 99.61, రిషికేష్ 99.53, రామసుమిత్ 99.51, అబ్దుల్ హక్ 99.48, అబ్దుల్ జీషన్ 99.41, శశి ప్రీతం 99.8 పర్సంటైల్, ఈ కార్తీక్‌రెడ్డి 99.09, మరో 11 మంది విద్యార్థులు 99పైన, 53 మంది విద్యార్థులకు 98పైన పర్సంటైల్‌తో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు వివరించారు.

ఎన్‌సీసీ కెడెట్ శ్వేతకు సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత నెల ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ ఆర్‌డీ పరేడ్‌లో ప్రతిభచాటిన జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కెడెట్ కే శ్వేతను మంగళవారం కళాశాలలో సన్మానించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జేవీ రాజిరెడ్డి, మాజీ ఎన్‌సీసీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ శ్రీలత తదితరులు ఉన్నారు.

మండలంలో యూరియా కొరత లేదు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యం తెలిపారు. మంగళవారం చెర్లబూత్కూర్ యూరియా బస్తాలా అన్‌లోడింగ్‌ను పరిశీలించారు. వచ్చిన యూరియాను ఒక్కో రైతుకు 4 బస్తాల చొప్పున ఆయా గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. కరీంనగర్ మండలానికి మొత్తం వంద టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. దుర్శేడ్ సొసైటీకి 40టన్నులు, చెర్లబూత్కూర్ విక్రయ కేంద్రానికి 20, బొమ్మకల్‌కు 20, నగునూర్‌లోని ఆగ్రోస్ కేంద్రానికి 10, తీగలగుట్టపల్లిలోని డీసీఎంఎస్ కేంద్రానికి 10 టన్నుల చొప్పున సరఫరా చేసినట్లు చెప్పారు. అవసరమైతే మళ్లీ ఇండెంట్ పెట్టి రైతుల డిమాండ్ మేరకు తెప్పించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి ఉన్నారు.

ఎస్సారార్ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో రాబోయే విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అధ్యాపకులు జూనియర్ కళాశాలల్లో ప్రచారం చేపట్టారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్ తిమ్మాపూర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తిమ్మాపూర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధర, తెలంగాణ మోడల్ స్కూల్ న్యాలకొండపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల కొడిమ్యాల, తెలంగాణ మోడల్ స్కూల్ కొడిమ్యాల కళాశాలలను సందర్శించారు. కళాశాలలో సౌకర్యాలు, కోర్సుల వివరాలను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

పూజా సామగ్రి విక్రయ హక్కులకు వేలం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఈ నెల 17న ఉదయం10-30 గంటలకు టెంకాయలు, పూజాసామగ్రి, కొబ్బరి ముక్కల పోగు హక్కుల కోసం వేలం నిర్వహించనున్నట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12-30 గంటలకు ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో విక్రయ హక్కు వేలం ఉంటుందని పేర్కొన్నారు.

● సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న ఉదయం 11 గంటలకు కొబ్బరి ముక్కల పోగు, ఫొటోలు,టెంకాయలు, పూల దండల విక్రయ హక్కు కోసం వేలం నిర్వహించనున్నట్లు ఈవో మారుతి తెలిపారు.

ఎస్సారార్ కళాశాలలో పరిశోధనాత్మక విద్య

గంగాధర, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎస్సారార్ కళాశాలలో నాణ్యమైన, పరిశోధన వైపు ప్రోత్సహించే విద్య అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఎస్సారార్ కళాశాల బృందం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లను సందర్శించి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల న్యాక్ ఏ గ్రేడ్‌తో పాటు అటానమస్ హోదా కలిగిన అతిపెద్ద డిగ్రీ కళాశాల అని అన్నారు. కళాశాలలో 36 డిగ్రీ కోర్సులతో పాటు 11 పీజీ కోర్సులు, ఇతర సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎస్సారార్ కళాశాలలో చేరి భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిషన్ బృంద బాధ్యులు డాక్టర్ మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, దోస్త్ సమన్వయ కర్త డాక్టర్ రామకృష్ణ, అధ్యాపక బృందం ప్రవీణ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, ప్రభు త్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపక కేంద్రం సందర్శన

రామడుగు,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని కిషన్‌రెడ్డి అనే రైతు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పట్టుపురుగులు గుడ్డు దశ నుంచి పట్టు వచ్చే వరకు ఎలా దాని దశలను మార్చుకుంటుందో రైతు కిషన్‌రెడ్డి వివరించారు. ఎంఈవో అంబటి వేణుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందించాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలందించాలని జామే మజీద్ ఈద్గా ఖబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ మంగళవారం పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రికి రోగి రాగానే వైద్య సిబ్బంది చికిత్స చేయకుండానే వరంగల్‌కు వెళ్లాలని సూచిస్తున్నారని, ఈ పద్ధతిని మానుకోవాలన్నారు. చిన్న చిన్న రోగులకు చికిత్స చేయకుండా స్కానింగ్‌లు, వైద్యం పేరిట ప్రైవేట్ ఆస్పత్రులకు పంపించవద్దని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థినికి బంగారు పతకం

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జన్ను కావ్య హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన మార్షల్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. మంగళవారం అంతర్జాతీయ క్రీడాకారుడు అంబాల ప్రభాకర్ ఆమెను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించిన తండ్రి రమేష్, కరాటే మాస్టర్ ఎస్కే జలీల్‌ను అభినందించాడు.

మోడల్ స్కూల్‌కు ప్రయోగశాల బస్

చొప్పదండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌కు సైన్స్ ప్రయోగశాల బస్ మంగళవారం చేరింది. బస్‌లో రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఏఐతో పాటు 30 అంశాల నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఏఎంవో అశోక్ రెడ్డి, జీసీడీవో కృపారాణి, స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్, చంద్ర కిరణ్, నీరజ్ కుమార్, సిద్ధార్థ, ధనుష్, జగదీశ్, సీఈవో మధులాష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చొప్పదండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి జేఏసీ నాయకులు ఎస్ఐ అనూషకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం గురించి ఇష్టారీతిన మాట్లాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం రవీందర్ రెడ్డి, మణిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలమైన శక్తిగా బీఆర్ఎస్

● పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు



మానకొండూర్‌లో మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునిగివపోయే ఓడ కాంగ్రెస్ పార్టీ అని, బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఉన్నదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో రాజకీయ అవగాహన లేని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖతం అయిందని మాటట్లాడడం సిగ్గుచేటన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నెలబెట్టని విషయం ఆయనకు తెలియదని రేవంత్‌రెడ్డి దయతో పదవి చేపట్టాడని విమర్శించారు. బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న విషయం కాంగ్రెస్ పార్టీ మరిచిపోరాదని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తే 119 స్థానాలలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. 10 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో కాలయాపన చేస్తుందన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో డకౌట్ విషయం కాంగ్రెస్ గుర్తించుకోవాలన్నారు. సీఎం నియోజకవర్గంలో కేటీఆర్ రైతు దీక్ష నిర్వహిస్తే రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, కేటీఆర్ విసిరిన సవాల్‌కు రేవంత్‌రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో కలెక్టర్ చాంబర్ వరకు వాహనాలు వెల్లడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచు రామంచ గోపాల్‌రెడ్డి, దండబోయిన శేఖర్, ఎరుకల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం

వీణవంక ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దేశాయిపల్లి,మల్లారెడ్డిపల్లి గ్రామాల నూతన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ ఆధ్వర్యంలో నియమించారు. దేశాయిపల్లి గ్రామ శాఖ అధ్యక్షునిగా ముసిపట్ల శ్రీధర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా దావు రాజిరెడ్డి,మల్లారెడ్డిపల్లి గ్రామశాఖ అధ్యక్షునిగా నిమ్మల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి సంపత్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతనికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి,నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి,మేకల ఎల్లారెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగించాలి

చొప్పదండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ శ్రేణులను బలపర్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలవాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మినుపాల తిరుపతరావు, మార్కెట్ మాజీ చైర్మన్లు ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

హుజూరాబాద్‌రూరల్,ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని శ్రీ పద్మ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు కన్నుల పండువగా జరగనున్నాయి.

రంగరాజన్‌పై దాడి అమానుషం

జమ్మికుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌పై కొంత మంది వ్యక్తులు అకారణంగా దాడి చేయడం అమానుషమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులకు వెంటనే శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా వారిని ప్రేరేపిస్తున్న వ్యక్తులను కూడా ప్రభుత్వాలు నియంత్రించాలని డిమాండ్ చేశారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



కాలువపై ఇరుకుగా ఉన్న వంతెన

చొప్పదండి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల క్రితం కాకతీయ కాలువ నిర్మాణం జరిగింది. నాటి కాలంలో రైతులు ఎక్కువగా ఎడ్ల బండ్లనే తమ వాహనాలుగా ఉపయోగించుకునే వారు. ఎడ్లబండ్ల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. రైతులు పొలాల వద్దకు ప్రతి పనికి ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని చిట్యాలపల్లి రైతుల వ్యవసాయ భూములు కాలువకు అవతలి వైపు ఉండగా దాటి వెళ్లేందుకు గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 50 ఏళ్ల క్రితం కాకతీయ కాలువ నిర్మాణ సమయంలో గ్రామ శివారులో కాలువను దాటేందుకు కార్ట్ బ్రిడ్జి(ఎడ్ల బండ్ల బ్రిడ్జి)ను నిర్మించారు. ఆరు అడుగుల వెడల్పు మాత్రమే ఉండగా బ్రిడ్జి పైనుంచి బైక్‌లు మాత్రమే వెళ్లే అవకాశం ఉంది. ట్రాక్టర్‌ల ద్వారా వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ట్రాక్టర్ వెళ్లాలంటే దాదాపు 5 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్ట్ బ్రిడ్జి పక్కన కొత్త వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ప్రతి రోజూ ట్రాక్టర్‌పై పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సంక్షిప్త సమాచారం..

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జ్యోతిష్మతి కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

● హుజూరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాపులో మాట్లాడారు.

● మానకొండూర్ : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి సతీమణి గోదావరి మండలంలోని మానకొండూర్, గంగిపల్లి గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రైవేటు పాఠశాలలోని సిబ్బందిని కలిసి బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: పట్టభద్రుల పక్షాన నిలబడి ప్రశ్నించే వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి సతీమణి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

● వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో బీజేపీ పట్టభ ద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతుగా సతీమణి చిన్నమైల్ గోదావరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● జమ్మికుంట: పట్టణ పరిధిలోని వెంకటాద్రినగర్‌లో గల శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ సప్తదశ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి తులసి అర్చన కార్యక్రమాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను కమిటీ చైర్మన్ రామిడి శ్రీధర్ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు.